క్లుప్తంగా

ఎస్సీ హాస్టల్లో సబ్‌కలెక్టర్ తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా

తర్లుపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా శుక్రవారం తనిఖీ చేశారు. మెనూ గురించి వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలు, సమీపంలోని మురుగు కాలువలను పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, తహసీల్దార్ అబ్దుల్ హమీద్, ఎంపీడీఓ చంద్రశేఖర్, పశువైద్యాధికారి నందన, ఈఓఆర్డీ బాలకృష్ణ, వీఆర్ఓ భాస్కర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ అచ్యుతరావు, జెడ్పీ స్కూల్ హెచ్ఎం సుధాకర్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కిరణ్

మార్కాపురం టౌన్: పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ఇ.కిరణ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్న దృష్ట్యా గృహాలు, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వలేకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య కార్మికులు తమ ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు చెత్త అందించి సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు, మాజీ సైనికులు

మార్కాపురం: దేశం కోసం అమరులైన కార్గిల్ వీర జవాన్లకు మాజీ సైనికుల అసోషియేషన్ సభ్యులు ఘనంగా నివాళి అర్పించారు. శుక్రవారం కార్గిల్ 25వ విజయ్ దివస్ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కార్గిల్ వీరుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ వాకిచర్ల శేషసాయి, గౌరవ సలహాదారులు ఎం.చిన్నయ్య, శ్రీనివాస్, రసూల్, కాశిరెడ్డి, డి.నాగయ్య, ఆశీర్వాదం, సంగారెడ్డి, శంకర్‌రెడ్డి, కృష్ణయ్య, మాజీ సైనికులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ట్రాన్స్‌పోర్టు గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న ఏఓ శ్రీనివాసులు

మార్కాపురం: నిబంధనలకు విరుద్ధంగా రవాణా సంస్థలు నిషేధిత పురుగుమందులు, వ్యవసాయ అనుబంధ విత్తనాలు, ఎరువులు రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని మార్కాపురం వ్యవసాయశాఖాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని నవత, వీఆర్ఎల్, క్రాంతి తదితర రవాణా సంస్థల గోడౌన్లను తనిఖీ చేశారు. డీలర్లు ప్రభుత్వ అనుమతితో కూడిన పురుగు మందులను మాత్రమే రవాణా చేయాలని, రశీదులు ఉన్న సరుకును మాత్రమే రవాణా చేయాలని ట్రాన్స్‌పోర్టు యజమానులకు స్పష్టం చేశారు.

శాకంబరిగా వాసవీ మాత



శాకంబరీ అలంకారంలో దర్శనమిస్తున్న వాసవీమాత

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని మెయిన్ బజారులో కొలువై ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శాకంబరీ అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చన చేశారు. వివిధ రకాల కూరగాయలతో వాసవీమాతను అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అక్కడంతా ప్రైవేట్ వ్యక్తుల వైద్యమే

- పశువైద్యశాలలో పశుపోషకుల ఇక్కట్లు
- ఇద్దరు డాక్టర్లున్నా ఉపయోగం సున్నా
- పట్టించుకోని జిల్లా అధికారులు



గేదెకు టానిక్ తాపుతున్న ప్రైవేట్ వ్యక్తి

కురిచేడు:

స్థానిక పశువైద్యశాలల్లో ప్రైవేట్ వ్యక్తుల వైద్యమే పశుపోషకులకు దిక్కైంది. మండలంలోని పశువులకు ఒకే ఒక్క పశువైద్యశాల ఉంది. దానిలో ఒక సహాయ డైరెక్టర్, ఒక పశువైద్యుడు ఉంటారు. కానీ వారి ఇష్టం వచ్చినప్పుడు వచ్చి వెళ్తుంటారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని 32 గ్రామాల పశువులకు సరైన వైద్య అందడం లేదు. సచివాలయాల్లో ఉన్న ఆహేలు పశువులు పొలాలకు వెళ్లాక విధులకు వస్తారు. అవి ఇంటికి వచ్చే సమయానికి తిరిగి వీరు కూడా ఇళ్లకు వెళ్లిపోతారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి పశువులు 1300, గొర్రెలు, మేకలు 35,000, కోళ్లు 11,000 ఉన్నాయి. మండల కేంద్రంలోని వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది సరిగా అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులు వైద్యం చేసి పశుపోషకులను సంతృప్తి పరుస్తున్నారు. గతంలో గోపాలమిత్రలు అందుబాటులో ఉండే వారు. వారికి అధికారికంగా ఎటువంటి నియామకం లేకున్నా వారు చేసే కృత్రిమ గర్భధారణను నిర్ధారించాల్సింది వైద్యులే కనుక వారు చెప్పిన పనిచేస్తూ ఉంటారు. ప్రభుత్వ పథకాల సమాచారం కూడా పశుపోషకులకు తెలియదంటే అతిశయోక్తి కాదు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించిన దాఖలాలు కూడా లేవు. సీజనల్ వ్యాధులకు సంబంధించి టీకాలు కూడా ఆ నలుగురే గ్రామాలకు వెళ్లి వేసి టార్గెట్లు పూర్తి చేస్తుంటారు.

గోపాలమిత్రను అటెండర్‌గా నియమించవచ్చు:

గోపాలమిత్రలను అటెండర్‌గా నియమించమని గతంలో ప్రభుత్వం జీఓ ఇచ్చింది. ఆ ప్రకారం ప్రసాద్‌ను అటెండరుగా నియమించాం. అటెండర్లు చిన్న చిన్న వైద్యం కూడా చేయవచ్చు. పెద్ద పెద్ద వ్యాధులకు మాత్రమే చికిత్స చేయకూడదు. నేను మీటింగ్‌కు వెళ్లాను. పశుపోషకులు ఇబ్బంది పడకూడదని చికిత్స చేసి ఉంటాడు. అందులో తప్పులేదు.

డాక్టర్ రమేష్, పశువైద్యాధికారి

చప్టాలపై రిటెయినింగ్ వాల్ నిర్మించాలి



ఎదురాళ్లపాడు సమీపంలో ప్రమాదకరంగా చప్టా



రేగడపల్లి వద్ద రిటెయినింగ్ వాల్ లేని చప్టా

కొనకనమిట్ల: మండలంలోని ఎదురాళ్లపాడు-వాగు మడుగు మధ్య చప్టాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎదురాళ్లపాడు సమీపంలో వాగుపై ఉన్న చప్టా, రేగడపల్లి మూల మలుపులో వాగుపై చప్టా నిర్మించారు. కానీ రిటెయినింగ్ వాల్ నిర్మించకుండా అలాగే వదిలేశారు. దీంతో చప్టాల వద్ద వాహనాలు ఎదురుపడినపుడు డ్రైవర్లతోపాటు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రేగడపల్లి వద్ద ఉన్న చప్టా మూలమలుపులో ఉండటం వల్ల స్పీడుగా వచ్చే వాహనాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం అధికంగా ఉంది. అధికారులు స్పందించి చప్టాల వద్ద సైడు గోడులు నిర్మించాలని, మూల మలుపుల వద్దప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ఎదురాళ్లపాడు, అంబాపురం, రేగడపల్లి, బోడపాడు, వాగుమడుగు, గనివానిపాడు గ్రామాల ప్రజలతోపాటు వాహనదారులు కోరుతున్నారు.

ఆధార్ సెంటర్లు ఎక్కడ?

కొనకనమిట్ల: నియోజకవర్గంలోని పలు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇటీవల ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బయోమెట్రిక్ అపడేషన్, మార్పుచేర్పులకు సంబంధించి సేవలు వినియోగించుకోవాలని అధికారులు సూచనలిస్తున్నారు. అయితే కొనకనమిట్ల మండలంలో మాత్రం ఎక్కడా ఆధార్ కేంద్రాల ఊసే లేదు. మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీలకు సంబంధించి 18 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. కొన్ని చోట్ల కూడా ఆధార్ క్యాంపులు నిర్వహించలేదు. దీంతో బయోమెట్రిక్ అప్‌డేషన్, న్యూ ఎన్‌రోల్‌మెంట్, ఆధార్, మొబైల్ లింక్, చిన్న పిల్లలకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ తదితర సేవలు పొందే అవకాశం లేకుండాపోయింది. ఈ విషయమై ఎంపీడీఓ సుగుణమ్మను వివరణ కోరగా క్యాంపులు నిర్వహించడానికి తమకు ఇబ్బంది ఏమీ లేదని, జిల్లా అధికారుల నుంచి ఆధార్ క్యాంపుల ఏర్పాటుపై ఎటువంటి సమాచారం లేదని చెప్పారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొనకనమిట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలని, జెడ్పీటీసీ సభ్యుడు, సొసైటీ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

ఓడీఎఫ్ సర్వే వేగంగా పూర్తి చేయండి



కంభం-4 సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కంభం: ఓడీఎఫ్ సర్వే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి తెలిపారు. సచివాలయాల పరిధిలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని సందర్శించి మరుగుదొడ్డి ఉందా లేదా, పక్కా మురుగు కాల్వలు ఉన్నాయా లేవా అనే వివరాలు యాప్‌లో పొందురిచామన్నారు. కంభం-4 సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

ఎస్సీ కాలనీ వాసుల అవస్థలు



మురికి కూపంగా చిల్లచెట్లతో నిండిన పంట కాలువ



ఎస్సీ కాలనీ చుట్టూ మురుగు నీరు చేరడంతో పెరిగిన చెట్లు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ సమీపంలోని ఎస్సీ కాలనీ వాసులు మురుగు నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ కాలువను హైస్కూల్ ముందు నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయం వరకు ఏర్పాటు చేశారు. డ్రైనేజీ కాలువ నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేయడంతో కాలనీ చుట్టూ మురికినీరు చేరుతోంది. వర్షాకాలంలో వర్షం నీరు మురికి నీటితో కలిసి కాలనీలోని గృహాల్లోకి చేరుతోంది. నిత్యం పాములు రోడ్లపైకి, గృహాల్లోకి చేరుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బేస్తవారిపేట పట్టణంలోని మురికి నీరు డ్రైనేజీ కాలువ ద్వారా ఎస్సీ కాలనీలోకి చేరడం, అక్కడి నుంచి పంట కాలువలోకి చేరుతుంది. పంట కాలువ మొత్తం మురికిమయంగా మారింది. దట్టంగా చిల్లకంప పెరిగి దుర్వాసన వెదజల్లుతోంది. ఒకవైపు దుర్వాసన, మరొక వైపు పాములు, తేళ్లతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని, పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు తెలిపారు.

విద్యార్థులకు ఆటపాటలు అవసరం



బాలికలకు టీఎల్ఎంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: విద్యార్థులు చదువుతోపాటు సంస్కృతి సంప్రదాయలపై అవగాహన పెంపొందించుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆర్.సురేఖ పేర్కొన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గొట్లగట్టు కేజీబీవీలో సాంకేతిక నైపుణ్యాల దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో విద్యార్థులకు టీఎల్ఎం బోధన సామగ్రిపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఆటపాటలతో విద్యార్థులు మానసిక ఉల్లాసాన్ని పొంది, ఆరోగ్యంగా ఉంటారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. బాలికలు పలు వేషధారణలతో అలరించారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కొనకనమిట్ల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, తమ జీవితానికి భద్రత కల్పించుకోవాలని ఎస్సై కె.మాధవరావు సూచించారు. శుక్రవారం సాయంత్రం కొనకనమిట్ల సమీపంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ వినియోగంతో ఉపయోగాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తెగుళ్ల నివారణ సాధ్యం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

బేస్తవారిపేట: ట్రైకోడెర్మావిరిడిని ఉపయోగించడంతో పంటలను తెగుళ్ల బారినుంచి కాపాడుకోవచ్చునని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ అన్నారు. శక్రవారం జేబీకే పురంలో ట్రైకోడెర్మావిరిడి, సూడోమోనాస్‌లను ఉత్పత్తి చేసే విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంట విత్తడానికి ముందు దీనిని చల్లుకోవడంతో నేల, విత్తనం ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్లను సమర్థవంతంగా అరికట్టవచ్చునని వివరించారు. వ్యవసాయాధికారి జక్కం మెర్సీ, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు బ్యాంకులో రుణాలివ్వాలి



మేనేజర్‌కు కౌలు రైతుల జాబితా అందిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: కౌలు రైతులకు సాగు చేసిన పంటలపై బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేయాలని ఏఓ కె.బుజ్జిబాయి తెలిపారు. మండలంలో గొబ్బూరు, దేవరాజుగట్టు గ్రామాల కౌలు రైతుల జాబితాను దేవరాజుగట్టులో కెనరా బ్యాంక్ మెనేజర్‌కు శుక్రవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన కౌలు రైతులకు సీసీఆర్‌సీతో ప్రభుత్వం ద్వారా రాయితీ, నష్టపరిహారం, బ్యాంకు రుణాలు వంటివి ఎంతో ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు. సొంత భూమి లేని రైతులు తోటి రైతుల నుంచి కౌలుకు తీసుకున్న వారికి 11 నెలలు అగ్రిమెంట్‌తో సీసీఆర్‌సీ ఇస్తామన్నారు. సొంత భూమి సాగుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అర్హులైన కౌలు రైతులందరికీ సాగు పత్రాలు అందించి, ప్రభుత్వ పథకాల ద్వారా కలిగే లబ్ధి వర్తించేలా కృషి చేస్తామన్నారు.

వైద్యశాల సమస్యల పరిష్కారానికి కృషి



వైద్యశాల పరిసరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

కంభం: కంభం ప్రభుత్వ వైద్యశాలలో పెండింగ్‌లో ఉన్న పనులు, చిన్నపాటి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక 50 పడకల ప్రభుత్వ వైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. వైద్యశాలలో ఓపీ నమోదు, ఆరోగ్యశ్రీ నమోదు వివరాలను తెలుసుకున్నారు. స్టాక్ రూమ్, ల్యాబ్, పురుషులు, స్త్రీల, చిన్నపిల్లల వార్డులు, ఆపరేషన్ థియేటర్, పరిసరాలను పరిశీలించారు. వైద్యశాలలో పారిశుధ్యం, జనరేటర్ సమస్య, వైద్యశాల మధ్య నుంచి వెళ్తున్న విద్యుత్ తీగల వల్ల కలిగే ఇబ్బందులు, తదితర సమస్యలను వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్ సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ వైద్యశాలకు ప్రస్తుతం వైరల్ ఫీవర్ కేసులు వస్తున్నట్లు వైద్యులు తెలిపారన్నారు. అసంపూర్తిగా ఉన్న టాయిలెట్స్ పనులు, ఇతర పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఫోన్‌లో తెలిపారు. కాంట్రాక్ట్‌లో భాగంగా వైద్యశాలకు రావాల్సిన జనరేటర్‌ను అందజేయాలని వారికి సూచించారు. వైద్యశాలలో ఒకవైపు నుంచి ఇరిగేషన్‌కాలువ వెళ్తుండటం దానిలో మురుగునీరు ప్రవహిస్తుందన్న విషయాన్ని తెలుసుకున్న సబ్ కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను పిలిపించి వెంటనే సమస్య పరిష్కరించేలా చూడాలని సూచించారు. లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, డీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి గృహోపకరణాల పంపిణీ



కేక్ కట్ చేస్తున్న వైద్య దంపతులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పీఆర్ కాలనీలో గల సంజీవని వృద్ధాశ్రమానికి కంభం ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్, డాక్టర్ పద్మావతి వారి కుమార్తె వేదాంసి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం గృహోపకరవస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆ వైద్య దంపతులు తమ కుమార్తె వేదాంసి పుట్టిన రోజును వృద్ధాశ్రమంలోని వృద్ధుల మధ్య, చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి ఆనందాన్ని వారితో పంచుకున్నారు. ప్రతి ఒక్కరు వారి పుట్టినరోజు సందర్భంగా ఇలా అనాథలమని భావించే వారి మధ్య నిర్వహించుకోవడం వల్ల వారికి ఎంతో ధైర్యంగా ఉంటుందని డాక్టర్ శివనాయక్ అన్నారు. మానవ సేవయే మాధవ సేవ అని భావించి ఆశ్రమానికి చేయూతగా నిలుస్తున్నామన్నారు. హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు రాయుడు, ఆశ్రమం నిర్వాహకులు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ దివస్



మాట్లాడుతున్న మాజీ సైనికుల సంఘం నాయకుడు శెట్లం వేణుగోపాల్

కంభం: కార్గిల్ దివస్ 25వ విజయోత్సవాలను శుక్రవారం కంభంలో మాజీ సైనికులు ఘనంగా నిర్వహించుకున్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. వీరనారి వకుళాదేవిని ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సత్కరించారు. మాజీ సైనికుల సంఘం నాయకుడు శెట్లం వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఈ ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని, డిఫెన్స్ వెల్ఫేర్ కార్డు అందించాలని కోరారు. అదే విధంగా నిరుద్యోగులకు అగ్నివీర్ పథకాన్ని తొలగించి పాత పద్ధతిలో ఆర్మీ సెలక్షన్లు నిర్వహించాలని కోరారు. మాజీ సైనికులు రామయ్య, ఎస్ఎం బాష, ముస్తఫా, పోలయ్య, సుబ్బయ్య, రంగయ్య గురువారెడ్డి, శ్రీనివాసరావు, పాండు రంగయ్య, చెన్నయ్య, మస్తాన్‌వలి, వీరనారీలు వకుళాదేవి, రాజ్యలక్ష్మి, నూర్జహాన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై కోటయ్య

పొదిలి: సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోతున్న కొద్దీ సైబర్ నేరాల సంఖ్య కూడా అదే స్థాయిలో ఉందని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జి.కోటయ్య సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాలలో సైబర్‌నేరాలు, డ్రగ్స్ వాడకంపై కలిగే దుష్పరిమాణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల ఆశలను, అమాయకత్వాన్ని ఆసరగా చేసుకుని సైబర్ నేరాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఉండాలన్నారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్ వాడకంతో జీవితాలు నాశనం అవుతాయని గుర్తించాలన్నారు. వాటి వాడకం, రవాణా గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.